క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

నెల్లూరు (టౌన్): ప్రధానమంత్రి కౌశల్ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువత, మహిళలకు టైలరింగ్, బ్యూటీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, కంప్యూటర్ హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, అప్లికేషన్ డెవలపర్ ఇన్ వెబ్ అండ్ మొబైల్, టాలీ, స్పోకెన్ ఇంగ్లిష్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్ కోర్సుల్లో మూడు నెలల పాటు శిక్షణను ఉచితంగా నిర్వహించనున్నామని జిల్లా మేనేజర్ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్లను అందజేయడంతో పాటు ఉద్యోగావకాశాలనూ కల్పించనున్నామని చెప్పారు. ఆసక్తి గల వారు తమ ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో పొగతోటలోని రవి చిన్నపిల్లల ఆస్పత్రి సమీపంలోని ప్రధానమంత్రి కౌశల్ కేంద్రానికి రావాలని కోరారు. వివరాలకు 79012 52389, 89855 31811 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అనధికార మద్యం విక్రేత అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): అనధికార మద్యం విక్రయాలపై నవాబుపేట పోలీసులు దాడులు చేశారు. వివరాలు.. ఇంటి వద్దే బడ్డీ కొట్టును నిర్వహిస్తున్న నాగేంద్రనగర్‌కు చెందిన రమణయ్య కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా అనధికారికంగా మద్యం విక్రయాలను సాగిస్తున్నారు. ఈ విషయమై నవాబుపేట ఇన్‌స్పెక్టర్ బాబీకి సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై రెహ్మాన్ తన సిబ్బందితో కలిసి బడ్డీ కొట్టుపై శుక్రవారం దాడి చేశారు. 12 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని రమణయ్యను అరెస్ట్ చేశారు.

3 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష

నెల్లూరు(బారకాసు): జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని జనవరి మూడున ప్రారంభించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమ పర్యవేక్షణకు నగరపాలక సంస్థ అధికారులతో ప్రత్యేక బృందాలను సిద్ధం చేశామని తెలిపారు. పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహించే తేదీలను ప్రజలకు తెలియజేసి.. వైద్యసేవలు అవసరమైన వారు శిబిరానికి వచ్చేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చాకలివీధి, జనార్దన్‌రెడ్డి కాలనీ, కోటమిట్ట, మల్లికార్జునపురం, రామచంద్రాపురం, రామ్మూర్తినగర్, ఆకుతోట, చంద్రమౌళీనగర్, అల్లీపురం ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలను మూడున నిర్వహించనున్నామని చెప్పారు.

యాక్సిడెంట్ కేసులో నిందితుడికి ఏడాది జైలు

నెల్లూరు (లీగల్): కారును అతి వేగంగా నడిపి ఒకరి మృతికి కారణమైన కేసులో నేరం రుజువు కావడంతో డ్రైవర్ సాగర్‌కు ఏడాది జైలు శిక్షను విధిస్తూ నెల్లూరు రెండో అదనపు మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి శారదారెడ్డి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. గుంటూరు నుంచి నాయుడుపేటకు 2020, ఏప్రిల్ 22న కారు బయల్దేరింది. ఈ క్రమంలో జాతీయ రహదారిపై నరుకూరు బ్రిడ్జి సమీపంలో ఉదయం 3.30 గంటల ప్రాంతంలో అతి వేగంగా వెళ్తున్న కారు ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను అధిగమించే క్రమంలో ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో కారులో ఉన్న గుంటూరుకు చెందిన మురళీకృష్ణ గాయపడగా, ఆయన భార్య అక్కడికక్కడే మృతి చెందారు. మురళీకృష్ణను సింహపురి హాస్పిటల్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నెల్లూరు నార్త్ ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం సాగర్‌పై కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ ఏపీపీ కల్పన వాదించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వాకర్స్ ఫీడర్‌లో మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరమేశ్వరినగర్, మనుమసిద్ధినగర్, పొర్లుకట్ట తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

వ్యభిచార గృహంపై దాడి

నెల్లూరు(క్రైమ్): వ్యభిచార గృహంపై పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలితో పాటు విటుడ్ని అరెస్ట్ చేశారు. వివరాలు.. హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన వనిజ కొంత కాలం క్రితం నగరానికి వచ్చారు. శ్రీహరినగర్ నాలుగో వీధిలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని వివిధ ప్రాంతాల నుంచి సెక్స్‌వర్కర్లను తీసుకొచ్చి వ్యభిచార గృహాన్ని నిర్వహించసాగారు. దీనిపై బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్‌కు పక్కా సమాచారం అందింది. తన సిబ్బందితో కలిసి దాడి చేసి నిర్వాహకురాలితో పాటు నవలాకులగార్డెన్స్‌కు చెందిన లక్ష్మణ్‌ను అరెస్ట్ చేశారు. ఇద్దరు సెక్స్‌వర్కర్లను అదుపులోకి తీసుకొని హోమ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎంపీ, పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 12వ డివిజన్లోని సాత్‌రాజుపాళెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి శుక్రవారం చేపట్టిన అనంతరం ఎంపీ మాట్లాడారు. నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. డివిజన్లో అభివృద్ధి పనులకు రూ.4.5 కోట్లను మంజూరు చేయనున్నామని తెలిపారు. సమస్యలను గుర్తించి తన దృష్టికి తీసుకురావాలని పార్టీ నేతలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లోనూ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం ఆనం అరుణమ్మ మాట్లాడారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి అవసరమైన నిధులను కేటాయించడంలో ఎంపీ ఎంతో చొరవ చూపుతున్నారని కొనియాడారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

కమ్యూనిటీ హాల్ ప్రారంభం

అందరికీ మంచి చేయడమే తన నైజమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఒకటో డివిజన్ నారాయణరెడ్డిపేటలో రూ.40 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం సీతారామాంజనేయస్వామి దేవస్థానంలో రాజగోపురం, శిఖర కలశ ప్రతిష్ట పూజలకు హాజరైన ఆయన మాట్లాడారు. మంచి చేయడమే తనకు తెలుసునన్నారు. నియోజకవర్గ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆయా ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించానని చెప్పారు. నారాయణరెడ్డిపేట అభివృద్ధికి రూ.15 లక్షలను మంజూరు చేస్తానని వెల్లడించారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమంచర్ల పంచాయతీలోని మన్నవరప్పాడు, గోటువారికండ్రిగ గ్రామాల్లో నూతన ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ఆమంచర్ల పంచాయతీలో 1452 ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయని వివరించారు. జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయితే మరింత సంక్షేమం, అభివృద్ధి జరుగుతాయని చెప్పారు. డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీజేపీ నేత చేరిక

నెల్లూరు రూరల్: బీజేపీ రాష్ట్ర నేత సుదర్శన్ చక్రధారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. నగరంలోని తన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో చక్రధారికి పార్టీ కండువా కప్పి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. పార్టీలో సముచిత స్థానాన్ని కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల తరుణంలో పార్టీలో చేరికలు పెరుగుతుండటం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం చక్రధారి మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా బీజేపీలో రాష్ట్ర స్థాయి పదవుల్లో కొనసాగానని, ఈసారి రూరల్ నియోజకవర్గంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి విజయానికి తన వంతు పాటుపడాలనే ఉద్దేశంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరానని చెప్పారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు సూరిబాబు, 29వ డివిజన్ కార్పొరేటర్ సత్తార్, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డబ్బులతో గెలుస్తాననే భావనలో నారాయణ

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): డబ్బులు కుమ్మరిస్తే గెలుస్తాననే భావనలో టీడీపీ నేత నారాయణ ఉన్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని ఆరో డివిజన్లో గల మౌలాసాహెబ్ వీధి, ఐటీ నాయుడివీధి, పీవీఆర్ యాదవ వీధి, బట్టీల వారి వీధి, అరుంధతీయపాళెం, శెట్టిగుంట మెయిన్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఎమ్మెల్యే శుక్రవారం పర్యటించారు. మౌలాసాహెబ్ వీధి ప్రాంతాలకు సంబంధించి రూ.40 లక్షలతో నిర్మించనున్న సీసీ డ్రెయిన్లు, రోడ్లకు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. డివిజన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని వివరించారు. టీడీపీ, జనసేనలో ఎవరికి టికెట్ ఇచ్చినా కలిసి పనిచేస్తామని జనసేన నేత మనుక్రాంత్‌రెడ్డి తెలిపారని, అయితే రాజకీయాల్లో లోపల ఒకటి.. బయట ఒకటి ఉంటుందనే అంశాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. ఎన్నికల్లో రూ.200 కోట్లు ఖర్చు చేసి.. విద్యార్థులపై రూ.పది వేల ఫీజు పెంచితే సరిపోతుందనే ఆలోచనతో వచ్చే వ్యక్తి నారాయణ అని విమర్శించారు. కార్పొరేటర్ మద్దినేని మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.


రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అనిల్‌కుమార్

ముస్లింలు ఐకమత్యంగా ఉండాలి

నెల్లూరు(బృందావనం): ముస్లింలు ఐకమత్యంగా ఉండాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కోటమిట్టలోని షాదీమంజిల్లో సిరాజ్ – ఉర్ – రెహ్మాన్ నిర్వహించిన ఓ ముస్లిం నీ గమ్యం ఎటు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ కరిముల్లా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగ రాష్ట్ర కార్యదర్శి హంజా హుస్సేనీ, ముస్లిం మైనార్టీ విభాగ జిల్లా అధ్యక్షుడు సిద్ధిఖ్, నేతలు అబ్దుల్ మస్తాన్, అతహర్‌బాషా, బాబా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని 39వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేత మునికుమార్ ఆయన మిత్రబృందం దాదాపు 100 మంది ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానాన్ని కల్పిస్తామని చెప్పారు. ఒక వీధిలో టీడీపీ అభ్యర్థి.. మరో వీధిలో జనసేన అభ్యర్థి ఎన్నికల ప్రచారం చేస్తుండటంతో ప్రజలు అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారని చెప్పారు. ఎవరికి సీటు ఇస్తే వారికే ఓటేయాలని ఇద్దరూ కలిసి ప్రచారం చేస్తే బాగుంటుందని సూచించారు. అనిల్, ముని, వర్మ, సంతోష్, మాచమల్లి మాధవ్, బాలకృష్ణ తదితరులు పార్టీలో చేరారు. జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహారావు, పార్టీ నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, మల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే అనిల్

కళాకారుల సంక్షేమానికి సహకారం

• రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

నెల్లూరు(బృందావనం): కళాకారుల సంక్షేమానికి తన వంతు తోడ్పాటునందిస్తానని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు. నగరంలోని పురమందిరంలో ఆంధ్రా, తెలంగాణ కళాకారుల సాంస్కృతిక సమ్మేళనాన్ని రంగస్థల కళాకారుడు ఖుద్దూస్‌బాషా, సుమధుర నాట్యమండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం 50 ఏళ్ల అభినందన సంచికను ఆవిష్కరించారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రంగస్థల నటులు, కళాకారులు, సాహితీవేత్తలు, ఉపన్యాసకులు 20 మందిని బీఎమ్మార్ ట్రస్ట్ ద్వారా శాలువాలు, మెమెంటోలు, రూ.ఐదు వేల నగదు పారితోషికాలతో సత్కరించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి, ఆర్డీఓ మలోల, నూర్‌బాషా సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సలీమ్, దేవరాల సుబ్రహ్మణ్యం, బొబ్బల శ్రీనివాస్‌యాదవ్, హరిబాబుయాదవ్, నూనె మల్లికార్జునయాదవ్, రేబాల శ్రీలక్ష్మి, గౌస్‌బాషా, మద్దూరు శ్రీనివాసులు, ఖాదర్‌బాషా, నల్లమల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.


సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న బీద మస్తాన్‌రావు

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(దర్గామిట్ట): నగరానికి విచ్చేసిన ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లాన్ని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో కలెక్టర్ హరినారాయణన్ కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

జీజీహెచ్ ప్రాంగణంలో బోర్ల ఏర్పాటు

నెల్లూరు సిటీ: నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ హాస్పిటల్లో ఇప్పటి వరకు సరఫరా అవుతున్న మున్సిపల్ వాటర్‌లో ఎలాంటి ఇబ్బందులు కలిగినా వాటిని అధిగమించేందుకు వీలుగా బోర్లను ఏర్పాటు చేయాలని జీజీహెచ్ అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో కార్ల పార్కింగ్ ప్రాంతాల్లో రెండు బోర్లను ఏర్పాటు చేశారు. 110 అడుగుల మేర బోర్లు వేశారు.

నేత్రదానం

నెల్లూరు సిటీ: నవాబుపేటకు చెందిన పబ్బిశెట్టి వెంకటకృష్ణయ్య మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారం మేరకు నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు.

బీజేపీ మీడియా ప్యానల్ సభ్యుడిగా భాస్కర్‌గౌడ్

నెల్లూరు(బారకాసు): బీజేపీ జిల్లా మీడియా ప్యానల్ సభ్యుడిగా భాస్కర్‌గౌడ్‌ను నియమించామని పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ జిల్లా కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకుమార్, గిరికుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

రెడ్డి భవన్‌కు స్థలాన్ని కేటాయించరూ..

నెల్లూరు(బృందావనం): నగరంలో రెడ్డి భవన నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని రెడ్ల ఐక్యవేదిక నెల్లూరు అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం సమర్పించారు. అదే విధంగా స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ స్థాపన కోసం నగరంలో స్థలాన్ని కేటాయించాలని కమిషనర్ వికాస్ మర్మత్‌కు విన్నవించారు. రెడ్ల ఐక్యవేదిక నేతలు డాక్టర్ బీవీ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, సంఘమిత్ర రవీంద్రరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, చంద్రమౌల్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శనలో చిన్నారి

నెల్లూరు(బృందావనం): గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 7200 మంది కూచిపూడి నాట్య కళాకారులతో నిర్వహించిన నృత్య ప్రదర్శనలో తమ పాఠశాల విద్యార్థి ధానికారెడ్డి పాల్గొందని భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని అయన అభినందించారు.

వేదగిరిలో తెలంగాణ సీఎం సోదరుడు



నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి శుక్రవారం నిర్వహించారు. ఆలయ మర్యాదలతో ఆయనకు ఆహ్వానం పలికారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరాన్ని ధన్వంతరి కేరళ ఆయుర్‌కేర్, కేరళ పంచకర్మ హాస్పిటల్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. డాక్టర్లు శ్రీవత్సవకుమార్, శ్రీకర్ భరద్వాజ్ దాదాపు 500 మందిని పరీక్షించి మందులను ఉచితంగా అందజేశారు. 41వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసరావు, ఈఓ మల్లికార్జునరెడ్డి, ప్రభాకర్‌రావు, శివ, రమాదేవి, నిత్య తదితరులు పాల్గొన్నారు.

నడక ఆరోగ్యానికి ఎంతో మేలు

నెల్లూరు(బారకాసు): నడక ఆరోగ్యానికి ఎంతో మేలని వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎమ్వీ రెడ్డి పేర్కొన్నారు. మైపాడు గేట్ సమీపంలోని శ్రీరామ్‌నగర్ పార్కులో వాకర్స్‌తో ప్రత్యేక సమావేశాన్ని మై వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ వాకర్స్ కన్వెన్షన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురికి అవార్డులను అందజేశారని చెప్పారు. మై వాకర్స్ క్లబ్ సెక్రటరీ, గౌరవాధ్యక్షుడు మద్దూరు సుబ్బారావు, రామ్మోహన్‌రావు అవార్డులను అందుకున్నారని తెలిపారు. జిల్లా వాకర్స్ కో ఆర్డినేటర్ బలరామ నాయుడు, క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణగుప్తా, ఉపాధ్యక్షుడు బాలకోటేశ్వరరావు, ట్రెజరర్ సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీ చలపతిరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను నిశితంగా పరిశీలించండి

నెల్లూరు(దర్గామిట్ట): సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను నిశితంగా పరిశీలించి అవసరమైన అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఓటర్ల జాబితా తయారీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముకేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌ను శుక్రవారం నిర్వహించి పలు సూచనలు చేశారు. కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్వో లవన్న, ఈఆర్వోలు బాపిరెడ్డి, చిన్న ఓబులేసు, ప్రేమ్‌కుమార్, శీనానాయక్, మలోల, మధులత పాల్గొన్నారు.

ప్రణాళికబద్ధంగా పారిశుధ్య పనులు

నెల్లూరు(బారకాసు): మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో నగరపాలక సంస్థలో అందుబాటులో ఉన్న కార్మికుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని నగరంలో పారిశుధ్య పనులను ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా ఎస్పీ కార్యాలయం, బట్వాడిపాళెం, అలంకార్ సెంటర్, బారకాస్ సెంటర్, మద్రాస్ బస్టాండ్, కలెక్టర్ కార్యాలయం, పాత మున్సిపల్ కార్యాలయం తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన మాట్లాడారు. రోడ్లపై వ్యర్థాలు ఉండకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య పనులు సక్రమంగా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ కొన్ని ప్రాంతాల్లో ఆశించిన స్థాయిలో లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎంహెచ్ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన టిడ్కో గృహాలను అందజేయండి

కార్పొరేషన్ పరిధిలోని టిడ్కో గృహాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ఏపీ టిడ్కో గృహాలకు సంబంధించిన పురోగతిపై ఇంజినీరింగ్, హౌసింగ్ విభాగాధికారులతో కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో కమిషనర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గృహ సముదాయాల్లో మౌలిక వసతులను కల్పించి.. లబ్ధిదారులకు అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. టిడ్కో ఎస్‌ఈ సైమన్‌రావు, ఈఈ ఉమాశంకర్, మెప్మా పీడీ రవీంద్ర, జిల్లా కో ఆర్డినేటర్ రామసుబ్బారావు, ఎల్డీఎం ప్రసాద్, పెంచలయ్య, జరీనా, ఎస్‌ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, హౌసింగ్ విభాగాధికారి సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ చైతన్యానికే నాటికల ప్రదర్శన

నెల్లూరు(బృందావనం): సమాజ చైతన్యం కోసమే నాటికలను ప్రదర్శిస్తున్నామని కళాకారుడు కేతా సుబ్బారావు పేర్కొన్నారు. కుంటి మేక పిల్ల నాటికను సుబేదారుపేటలో శుక్రవారం ప్రదర్శించారు. నటుడు గిరీశం పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యం

నెల్లూరు(క్రైమ్): శాంతిభద్రతల పరిరక్షణలో అహర్నిశలూ శ్రమిస్తున్న సిబ్బంది సంక్షేమమే ప్రథమ కర్తవ్యమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పోలీస్ కవాతు మైదానంలో పోలీస్ వెల్ఫేర్ డేను శుక్రవారం నిర్వహించారు. పదోన్నతులు, అనారోగ్యం, బదిలీలు, సర్వీస్ సంబంధిత సమస్యలు తదితరాలను ఎస్పీకి సిబ్బంది తెలియజేశారు. వీటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

కవాతు వీక్షణ

పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సిబ్బంది నిర్వహించిన కవాతును ఎస్పీ వీక్షించి వారి నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఏఆర్ ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో ఇళ్ల వద్దే సంతోషంగా జరుపుకోవాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ఆయన మాట్లాడారు. బహిరంగ ప్రదేశాల్లో పార్టీలు చేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రధాన కూడళ్లలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలను ముమ్మరం చేయనున్నామని వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా.. మద్యం మత్తులో వాహనాలు నడిపినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, సైలెన్సర్లు లేకుండా పెద్ద శబ్దాలు చేస్తూ వాహనాలు నడిపితే సీజ్ చేస్తామన్నారు. దుకాణాలను రాత్రి పది గంటల్లోపు మూసేయాలని, ప్రభుత్వ నిర్దేశిత వేళల వరకే మద్యం, బార్ల నిర్వహణకు అనుమతిస్తామని తెలిపారు.

డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



నెల్లూరు(సెంట్రల్): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. వీసీ శారద జయలక్ష్మీదేవి, విస్తరణ సంచాలకుడు సుబ్బరామిరెడ్డి, కేవీకే ప్రధాన శాస్త్రవేత్త లలితాశివజ్యోతి పాల్గొన్నారు.

నెల్లూరు (దర్గామిట్ట): గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వోద్యోగుల సంఘ నూతన సంవత్సర క్యాలెండర్లను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఏపీజీఈఏ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, మల్లికార్జున, వీడబ్ల్యూఎస్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మణి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బషీర్ అహ్మద్, బ్రహ్మనాయుడు, అసోసియేట్ ప్రెసిడెంట్ బాబూరావు, నేతలు స్నేహలత, మస్తాన్‌బాబు, రామచంద్ర, వీరేంద్ర, విజయ్, మనోజ్, శ్రావణ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

• గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ ప్రభుత్వోద్యోగుల అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్లను నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. సంఘ జిల్లా అధ్యక్షులు స్నేహలత, వీడబ్ల్యూఎస్ హెచ్‌జీఈఏ నెల్లూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, కళావతి, ట్రెజరర్ రజనీకుమారి, ఆర్గనైజింగ్ సెక్రటరీ భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు సునీత, రజిత, రత్నకుమారి, సరితకుమారి, భారతి తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (పొగతోట): ఏపీజీఈఏ నెల్లూరు సిటీ యూనిట్, గ్రామీణ తాలూకా యూనిట్ టేబుల్ కాలెండర్లను నగరంలోని తన కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆవిష్కరించారు. మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలను ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, కార్యదర్శి మల్లికార్జున తెలియజేశారు. సిటీ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్, నారాయణ, నెల్లూరు గ్రామీణ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకమరాజు శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, సుజాతాబాయి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను విజయవాడలోని విద్యుత్ సౌధలో ఏపీ ఎనర్జీ సెక్రటరీ విజయానంద్, విద్యుత్ విజిలెన్స్ జేడీఎం మల్లారెడ్డి ఆవిష్కరించారు. అసోసియేషన్ రాష్ట్ర నేతలు మహేశ్వరరెడ్డి, శేషారెడ్డి, సుబ్బారావు, హుస్సేన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఆడుదాం.. ఆంధ్రాలో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డీఎస్డీఓ యతిరాజ్ పర్యవేక్షించారు.

వేడుకగా ఆరాట్టు ఉత్సవం

నెల్లూరు(బృందావనం): నగరంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో ఆరాట్టు ఉత్సవాన్ని నిర్వహించారు. శేషగిరిరావు, వెంకటరత్నం, కోశాధికారి రత్నయ్య, శంకరన్, విజయన్, మోహన్‌రావు, మురళీమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాంబాబుకు ఏఎస్పీగా పదోన్నతి

నెల్లూరు(క్రైమ్): రాష్ట్ర వ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు ఏఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను శుక్రవారం జారీ చేసింది. ఇందులో భాగంగా నెల్లూరు సీఐడీ డీఎస్పీ రాంబాబు ఏఎస్పీగా పదోన్నతి పొంది ఇంటెలిజెన్స్‌లో నియమితులయ్యారు. గుంటూరు జిల్లా చెరుకుపల్లి మండలం వాకావారిపల్లికి చెందిన రాంబాబు 1989లో పోలీస్‌శాఖలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టారు.